క్లుప్తంగా

మూగజీవాల అపహరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మూగజీవాలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకెళ్లిన ఘటన కాగులపాడులో చోటు చేసుకుంది. వివరాలు.. కాగులపాడులో ఉక్కాల రవికి చెందిన 22 గొర్రెలు, రెండు మేకలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం వేకువన అపహరించుకెళ్లారు. ఉదయం లేచి చూసిన బాధితుడు గ్రామం మొత్తం వెతికినా కనిపించలేదు. దీంతో బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేశారు. జీవాల విలువ సుమారు రూ.1.50లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మహేంద్ర తెలిపారు.

జైనకుమారి సేవలు మరువలేనివి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : ఆత్మకూరు సీడీపీఓగా జైన్‌కుమారి అందించిన సేవలు మరువలేనివని ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ పేర్కొన్నారు. ఈ నెల 16నజైనకుమారి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె పెద్దకర్మ బుచ్చిరెడ్డిపాళెంలోని ఎస్ఎస్ కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్ హాజరై జైనకుమారి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. జిల్లాలోని కోవూరు, అల్లూరు, సంగం, ఆత్మకూరు, కొడవలూరు, విడవలూరు, దగదర్తి, ఏఎస్‌పేట, అనంతసాగరం మండలాల్లో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించారని గుర్తుచేశారు. పనిచేసిన అన్ని మండలాల్లో మంచిపేరు తెచ్చుకున్నారని కొనియాడారు.

రోడ్డుపై కూలిన భారీ చింత చెట్టు



ఇందుకూరుపేట : వర్షం కారణంగా మండలంలోని ఏడో మైలు వద్ద బుధవారం రోడ్డుకు అడ్డంగా భారీ చింతచెట్టు కూలింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. స్థానికులు, పంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించడంతో రాకపోకలు కొనసాగాయి.

ఆపద వేళ పరారీలో టీడీపీ నేతలు

ఇందుకూరుపేట : ప్రజలకు ఏమైనా ఆపద వస్తే టీడీపీ నేతలు పరారీలో ఉంటారని, అంతా పూర్తయ్యాక మళ్లీ ప్రజల్లోకి వచ్చి అర్థరహిత విమర్శలు చేస్తారని ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని పున్నూరు గ్రామంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరదల సమయంలో, కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అండగా నిలిచిందని గుర్తుచేశారు. టీడీపీ నేత పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ప్రజలకు వాస్తవాలు చెప్పాలన్నారు. కరోనా కష్టకాలంలో ఎమ్మెల్యే ప్రసన్న తన సొంత నిధులు, దాతల సాయంతో గ్రామాలకు కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు పంపిణీచినట్లు గుర్తుచేశారు. చంద్రబాబు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు ఏమి చేశారో చెప్పాలని నిలదీశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బీవీ రమణయ్య, ఎంపీటీసీ కరుణాకర్, పార్టీ నేతలు గొల్లపల్లి అవినాష్, ఉదయ్, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

24న బైక్ వేలం

ఆత్మకూరు: ఆత్మకూరు పోలీసుస్టేషన్ పరిధిలో ఓ కేసులో పట్టుబడిన బైక్‌ను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 24న శుక్రవారం వేలం వేయనున్నట్లు ఎస్సై ముత్యాలరావు బుధవారం తెలిపారు. హీరోహోండా మోటారు సైకిల్‌కు దరావత్తుగా రూ.1800 చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని చెప్పారు. వేలం ముగిసిన అనంతరం పూర్తి నగదు చెల్లించి వాహనాన్ని స్వాధీనం చేసుకోవచ్చునని తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఆత్మకూరురూరల్: ఈనెల 27న సోమవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని డిపో మేనేజరు కరీమున్నీసా, సీఐ కల్పన బుధవారం తెలిపారు. ఈ నెల 26న ఉదయం 8 గంటలకు తొలి సూపర్‌లగ్జరీ బస్సు ఆత్మకూరు నుంచి అరుణాచలం బయలు దేరుతుందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇప్పటికే ఆ బస్సు రిజర్వేషన్ పూర్తయినందున, రెండో బస్సు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రానుపోను టికెట్ ధర రూ.1400 నిర్ణయించామన్నారు. మార్గమధ్యంలో కాణిపాకం, సిరిపురం, అరుణాచలం గిరి ప్రదర్శన, తదితర ప్రదేశాలను సందర్శించవచ్చన్నారు. పూర్తి వివరాల కోసం డిపో మేనేజర్ 99592 25645, సీఐ 99660 09395 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలేరమ్మ ఆలయంలో చోరీ

వరికుంటపాడు: మండలంలోని యర్రంరెడ్డిపల్లి శివారులో ఉన్న గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. జన సంచారం లేని గ్రామ శివారులో ఆలయం ఉండడంతో గుర్తుతెలియని వ్యక్తులు లోనికి ప్రవేశించి హుండీని అపహరించుకుని వెళ్లారు. సమీపంలోని పొలాల్లో పగులగొట్టి అందులోని కానుకలను తీసుకుని హుండీని అక్కడే వదిలేశారు. ఉదయం అటు వైపుగా వెళ్లిన గ్రామస్తులు హుండీని గుర్తించారు. చోరీ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు.

విద్య,వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం



18వడివిజన్‌లో మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని 18వ డివిజన్‌లో రూ.60 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు డివిజన్ పరిధిలో రూ.కోటితో అభివృద్ధి పనులు పూర్తిచేశామని వివరించారు. మరో కోటిన్నర రూపాయల నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఆస్పత్రులను అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పిస్తోందని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని భరోసా కల్పించిందన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల వారికి సంక్షేమ లబ్ధి చేకూరుతుందన్నారు. పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్టు తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్యన వారధిలా వ్యవహరిస్తూ అవినీతికి ఏ మాత్రం తావులేకుండా ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని తెలిపారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద శాతం నేరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ప్రజలు ఆదరించాలని కోరారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, రూరల్ నియోజకవర్గ నుంచి తనను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, రైల్వేబోర్డు మెంబర్ స్వర్ణా వెంకయ్య, కార్పొరేటర్ అశోక్, నాయకులు, కార్యకర్తలు, నగరపాలక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్, అల్లీపురంలో టిడ్కో గృహ సముదాయంలో జరుగుతున్న తుది దశ ఇళ్ల నిర్మాణ, మౌలిక వసతుల పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరతగతిన అందుబాటులోకి తీసుకురావాలని మేయర్ స్రవంతి జయవర్ధన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మేయర్ తన ఛాంబర్‌లో టిడ్కో ఇళ్ల పనుల పురోగతిపై హౌసింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అల్లీపురం టిడ్కో గృహ సముదాయంలో దాదాపు 11,424 ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. గృహ సముదాయానికి తాగునీటిని సరఫరా చేసే పైప్‌లైన్ మరమ్మతు పనులను ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ఇంజినీరింగ్ అధికారులను ప్రశ్నించారు. రూ.1.70 కోట్లతో 550 మీటర్ల మేర చేపడుతున్న నూతన పైపులైన్ నిర్మాణ పనులను త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. టిడ్కో గృహాలను వీలైనంత



ఇంజినీరింగ్ అధికారులతో టిడ్కో గృహాలపై సమీక్షిస్తున్న మేయర్ స్రవంతి

త్వరగా ప్రజలకు అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్‌టీపీ డ్రెయిన్ పనులు 80శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను పూర్తి చేస్తామని మేయర్ తెలిపారు. ఈ సమావేశంలో టిడ్కో హౌసింగ్, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, ఎల్‌అండ్‌టీ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు.

వేదగిరిపై పవిత్రోత్సవాలకు అంకురార్పణ



నెల్లూరు రూరల్: రూరల్ మండలం, నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలకు బుధవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. శ్రీవారు, ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. ఆగమ విద్వాన్ సత్యనారాణచార్యుల బృందంతో పాటు ఆలయ ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, అర్చకులు పూజల్లో పాల్గొని పవిత్రోత్సవాల విశిష్టతను భక్తులకు వివరించారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు (టౌన్): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని తాడేపల్లిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యూవల్ పొడిగింపునకు సహకరించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలను సజ్జల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని, కేజీబీవీల్లో పని చేస్తున్న సీఆర్టీలకు మినిమం స్కేల్ వర్తింపజేయాలని, గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న వారికి 2015 పీఆర్సీ ప్రకారం జీతాలు పెంచాలని కోరామని చెప్పారు. సీఆర్టీలకు 23 శాతం జీతాల పెంపు, సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, పీఈటీలకు పార్ట్‌టైం హోదా మార్పు, మున్సిపల్ స్కూళ్లలో మిగిలిన లాంగ్వేజ్ పండిట్లు, పీఈటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించాలని



సజ్జలను కలిసిన ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

విజ్ఞప్తి చేశామని తెలిపారు. అలాగే విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి ప్రవీణ్‌ప్రకాష్‌ను ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి విజయవాడలో మార్యదపూర్వకంగా కలిశారు. ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రెన్యూవల్ పొడిగింపుపై ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రవీణ్‌ప్రకాష్ దృష్టికి తీసుకెళ్లారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పస్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. స్థానిక అయ్యప్పసేవా భక్త బృందం ఆధ్వర్యంలో చేపడుతున్న 41 రోజుల భిక్ష కార్యక్రమం 21 రోజులు పూర్తయిన సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భిక్ష ఏర్పాటు చేశారు. గోపాల్‌రెడ్డిస్వామి,



రవి, ఆనంద్, మల్లికార్జున, నాగసుబ్బారెడ్డి, నాగరాజు, తిరుపాలు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు.

ఏటూరు పాఠశాలకు బెంచీల వితరణ

నెల్లూరు(దర్గామిట్ట): చేజర్ల మండలం ఏటూరు గ్రామ ప్రాథమిక పాఠశాలకు ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం ద్వారా దాత పది బెంచీలను వితరణ చేశారు. నెల్లూరులోని నివాసంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ మర్రిపాడు మండలం భీమవరం వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏటూరు పంచాయతీ పరిశీలకుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి తన సొంత నిధులతో ఏడీఎఫ్ ఆధ్వర్యంలో ఏటూరు పాఠశాలకు బెంచీలను అందజేశారని తెలిపారు. ఏడీఎఫ్ ద్వారా గ్రామాల అభివృద్ధికి పలువురు దాతలు ముందుకొస్తున్నారని, వారి సహకారంతో నియోజకవర్గంలో అభివృద్ధి



బెంచీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

కార్యక్రమాలను కొనసాగిస్తామన్నారు. విద్యార్థులకు బెంచీలను అందజేసిన వెంకటేశ్వరరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

షిఫ్ట్‌ఆపరేటర్‌ను విధుల్లోకి తీసుకోవాలని వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): మనుబోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న గిరిజన యువకుడు చిట్టేటి భానుచందర్‌ను విధుల నుంచి తొలగించడం అన్యాయమని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా యానాదుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు విద్యుత్ భవన్‌లో టెక్నికల్ ఈఈ బాలచంద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. యువకుడ్ని విధుల్లోకి తీసుకోని పక్షంలో ఈ నెల 27న విద్యుత్ భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ, జనసేన నాయకులు శ్రీరామ్, ఉష, తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ల(గ్రేడ్-2 జేఎల్‌ఎం) సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తగా నిర్వహించతలపెట్టిన ఆందోళన కార్యక్రమాలకు జిల్లాలోని ఎనర్జీ అసిస్టెంట్లు సిద్ధం కావాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ అసిస్టెంట్ల అసోసియేషన్ జిల్లా కన్వీనర్ సాయివిశ్వనాథ్ పిలుపునిచ్చారు. నగరంలోని రాజేంద్రనగర్ విద్యుత్‌సబ్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ డిక్లరేషన్, మెడికల్‌లీవ్‌లు, హెల్త్ కార్డులు ఇవ్వాలని, సచివాలయ ఉద్యోగుల మాదిరిగా ట్రెజరీ ద్వారా వేతనాలు అందజేసి సచివాలయ ఉద్యోగులుగా పరిగణించాలని కోరారు. తమ సమస్యలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 27 నుంచి 29 వరకు పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టనున్నట్లు తెలిపారు. డిసెంబరు 4, 5 తేదీల్లో మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓలు, 11,12 తేదీల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, 15, 16 తేదీల్లో కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు. డిసెంబరు 18 నుంచి 23వ తేదీ వరకు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావడం, 26న సచివాలయ కేంద్రాలుగానే విధులు నిర్వహించడం వంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు.

పీఎంపీల సేవలు ఎనలేనివి



నెల్లూరు సిటీ: గ్రామీణ ప్రాంత ప్రజలకు పీఎంపీలు అందిస్తున్న సేవలు ఎనలేనివని జిల్లా వైద్యారోగ్య శాఖ డెమో అధికారి బీ శ్రీనివాసులు కొనియాడారు. నగరంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి డెమో అధికారి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామాలు, అడవులు, కొండ ప్రాంతాల్లో సేవలందిస్తున్న ఘనత ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్‌కే దక్కుతుందన్నారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సేవే ధ్యేయంగా అతితక్కువ ధరకు సేవలందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైద్యులు పీ అశ్వన్‌కుమార్, చైతన్యకుమార్‌రెడ్డి, వినీలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

4న ఘంటసాల జయంతి వేడుకలు



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో డిసెంబరు 4న ఘంటసాల వెంకటేశ్వరరావు 101 వ జయంతి వేడుకలను కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ ట్రస్ట్ అధ్యక్షుడు కేతా సుబ్బారావు తెలిపారు. బుధవారం ట్రంకురోడ్డులోని గాంధీబొమ్మ వద్ద ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేతా సుబ్బారావు మాట్లాడుతూ ఘంటసాల జయంతి సందర్భంగా ఆయన పాడిన పాటలకు సంబంధించి పాటలు, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన కళాకారులు ఈ నెల 27వ తేదీలోగా 77299 42543 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్కేడీ అంజాద్‌బాషా, వీ మహేష్, పీ అమానుల్లాఖాన్, వంశీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కుల గణనను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలి



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

• కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కులగణన ప్రక్రియను నగరపాలక సంస్థ పరిధిలో ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని కమిషనర్ వికాస్‌మర్మత్ సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో వార్డు సచివాలయ కార్యదర్శులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కులగణన, ఓటరు ముసాయిదా జాబితా, ఆడుదాం ఆంధ్రా, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శులు బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 27 నుంచి కులగణన ప్రక్రియను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇతరులు తెలుసుకోలేనట్టి పటిష్టమైన విధానాల్లో కులగణన చేపట్టనున్నామని చెప్పారు. కుల గణన సర్వేలో ప్రజలు తెలిపిన కుల సమాచారాన్ని ఎలాంటి ఆధార పత్రాల ధ్రువీకరణ లేకుండానే నమోదు చేసుకోవాలని సూచించారు. కొన్ని కులాలకు రాష్ట్రంలో గుర్తింపు లేనందున అలాంటి వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. సమాజంలోని అన్ని వర్గాలను సర్వేలో మమేకం చేసి సమగ్రమైన వివరాలను సేకరించాలని సూచించారు. డిసెంబరు 3వ తేదీ వరకు అన్ని వర్గాల ప్రజల నుంచి కులగణన వివరాలను సేకరించి సమగ్రమైన సమాచారాన్ని అందజేయాలని చెప్పారు. ఓటరు జాబితా రూపకల్పనకు అవసరమైన తుది ఓటరు ముసాయిదాలో మార్పులు, చేర్పులకు అవసరమైన అన్ని ఫారాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులందరికీ ఓటర్లుగా అవకాశం కల్పించాలని సూచించారు. పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారించి అర్హులకు ఓటరు జాబితాలో స్థానం కల్పించాలని సూచించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై ప్రజల్లో అవగాహన కల్పించి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొనేలా చూడాలని కమిషనర్ ఆదేశించారు. క్రీడల నిర్వహణలో సచివాలయ కార్యదర్శులు ప్రత్యక్షంగా పాల్గొని పర్యవేక్షించాలని సూచించారు. రెవెన్యూ లక్ష్యాలను సాధనకు ప్రతిజ్ఞకరూ కృషి చేయాలన్నారు. పెండింగ్ బకాయిలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శర్మద, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, టీపీఆర్వో ప్రసాద్, నగర పాలక సంస్థలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

• జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. రూరల్ మండలం, ములుముడిలో బుధవారం నిర్వహించిన 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొన్నారు. పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల హామీలను వంద శాతం నేరవేర్చిన, 33 సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితే అన్ని వర్గాలకు మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి వెళ్లి ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని సూచించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు



పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

సమష్టిగా పనిచేయాలన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రూరల్ ఎమ్మెల్యేగా ఆదాల ప్రభాకర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, జేసీఎస్ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, స్థానిక నాయకులు, మండలాధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంలో భాగస్వాములం కావడం సంతోషకరం

• డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(బారకాసు): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తామంతా భాగస్వాములు కావడం సంతోషకరంగా ఉందని కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటై రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో పలువురు కార్పొరేటర్లతో కలిసి బుధవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా వైఎస్సార్‌సీపీ నెల్లూరు కార్పొరేషన్‌లోని 54 డివిజన్లను గెలుచుకుందని చెప్పారు. కార్పొరేషన్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేసి నేటికి రెండేళ్లు పూర్తయిందన్నారు. తమ ఆరాధ్య నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో గతంలో కంటే అనేక రకాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. తమ హయాంలోనే నెల్లూరు కార్పొరేషన్ సఫాయి మిత్ర సురక్ష ఛాలెంజ్‌లో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలవడం తమకెంతో గర్వకారణమన్నారు. కౌన్సిలర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారంతో దేశంలోనే పెద్దపెద్ద మహానగరాలను సైతం పక్కనపెట్టి నెల్లూరు కార్పొరేషన్ మొదటి స్థానం దక్కించుకోవడం సంతోషకరమన్నారు. అప్పటి కమిషనర్‌గా ఉన్న దినేష్‌కుమార్ కేంద్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ చేతుల మీదుగా రూ.10 కోట్ల నగదు బహుమతి అందుకున్నారని గుర్తుచేశారు. విజయ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్

వాడ, విశాఖపట్నం వంటి మహానగరాల్లో ఉన్న కమాండ్ కంట్రోల్ భవనాన్ని నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో రూ.15 కోట్లతో అత్యాధునికంగా నిర్మించినట్లు తెలిపారు. త్వరలోనే భవనాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వంలో కార్పొరేషన్ పరిధిలో 27వేల మంది పెన్షనర్లు ఉండగా, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ సంఖ్య 48వేలకు పెరిగిందని తెలిపారు. పేదలపై ఆర్థికభారం పడకుండా టిడ్కో గృహాలను ఫ్రీగా లబ్ధిదారులకు అందజేస్తున్నామని చెప్పారు. పేద, మధ్య తరగతి ముస్లిం మైనార్టీల కోసం అసంపూర్తిగా ఉన్న షాదీమంజిల్‌ను రూ.8 కోట్లతో అత్యాధునికంగా నిర్మాణం చేపట్టి సుందరంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు ఇంతియాజ్, గోగులనాగరాజు, నాగమణి పాల్గొన్నారు.

తరతరాల భూ సమస్యలకు పరిష్కారం

• రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
• అసైన్‌మెంట్ భూములకు పట్టాల పంపిణీ

ముత్తుకూరు : తరతరాలుగా పేద రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని రాష్ట్ర వ్యవసాయ-సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. ముత్తుకూరులోని మత్స్యకళాశాలలో మండలంలోని పేద రైతులు అనుభవిస్తున్న అసైన్‌మెంట్ భూములకు మంత్రి బుధవారం పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలో 377 మంది రైతులకు సంబంధించి 288 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేస్తున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో 5,023 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. ఒక్క నారికేళపల్లి పంచాయతీలోనే 135 కుటుంబాలకు సంబంధించి 126 ఎకరాల భూములకు పట్టాలు పంపిణీ చేయడం విశేషమన్నారు. ఒక వేళ పరిశ్రమలకు అవసరమైన భూములు సేకరిస్తే రైతులే పరిహారం పొందే స్వేచ్ఛ ఉంటుందని చెప్పారు. ఇందులో ఏపీఐఐసీ ప్రమేయం, జోక్యం ఉండదన్నారు. ఈ విధంగా అసైన్‌మెంట్ భూములను విలువైన పట్టా భూములుగా మార్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద రైతులకు ఆస్తిగా అందించారన్నారు. ప్రతిపక్ష



భూ పట్టా అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తన దృష్టికి వచ్చిన ఈ సమస్యను ఇప్పుడు మంత్రి హోదాలో సీఎంతో చర్చించి, పరిష్కరించడం సంతోషంగా ఉందన్నారు. తెల్లదొరల కాలంనాటి చుక్కల భూముల సమస్యను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. అయితేఅసైన్‌మెంట్ భూములకు పట్టాలు ఇవ్వడం టీడీపీ నేత సోమిరెడ్డికి ఇష్టం లేదని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధనరెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, మండల ఉపాధ్యక్షుడు పోలిరెడ్డి చిన్నపరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పార్టీ నేతలు మునుకూరు రవికుమార్‌రెడ్డి, దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, దువ్వూరు విశ్వమోహన్‌రెడ్డి, మునుకూరు జనార్దనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.